# రసవత్తర రాజకీయం




# రేవంత్ వర్సెస్ కోమటిరెడ్డి

ఇద్దరి మధ్య మళ్లీ చిచ్చురేపిన ఇబ్రహీంపట్నం టికెట్

మల్‌రెడ్డికి ఇవ్వాలంటూ పట్టుబడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు

నా పార్లమెంటు పరిధిలో నీ పెత్తనమేందంటున్న కోమటిరెడ్డి



- ఇటీవల ఢిల్లీలో ఇద్దరు నేతల మధ్య తీవ్ర వాగ్వాదం
- తెరపైకి మరో ఇద్దరు బీసీ నేతలు..
- విసిగెత్తి కారెక్కుతున్న కాంగ్రెస్ శ్రేణులు

నిత్యం నిప్పు-ఉప్పులా ఉండే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి.. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి మధ్య మరో వివాదం వచ్చి పడింది. ఇబ్రహీంపట్నం టికెట్ విషయంలో ఇద్దరు నేతల మధ్య పంతం పెరిగింది. మల్‌రెడ్డి రంగారెడ్డికే టికెట్ ఇప్పించేందుకు రేవంత్‌రెడ్డి హస్తినలో ప్రయత్నాలు చేస్తుండగా... తన పార్లమెంటు పరిధిలోకి వచ్చే నియోజకవర్గంలో నీ పెత్తనం ఏందంటూ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫైర్ అవుతున్నారు. దీంతో ఇటీవల హస్తిన వేదికగానే ఇద్దరు నేతల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. ముఖ్యంగా ఎవరికి వారు తగ్గేదేలే! అంటూ తమ వర్గం నేతల్ని ప్రోత్సహిస్తుండటంతో ఇబ్రహీంపట్నంలో ఎవరికి వారు తమదే టికెట్ అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. దీనికి తోడు మరో ఇద్దరు బీసీ నేతలు కూడా టికెట్‌ను ఆశిస్తుండటంతో 'ఇదేం గోలరా బాబూ' అనుకొని కాంగ్రెస్ శ్రేణులు కారెక్కుతున్నారు. అందుకే గత కొన్నిరోజులుగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో నిత్యం కాంగ్రెస్ నుంచి వలసలు కొనసాగుతున్నాయి.

- సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ)/ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం టికెట్ కాంగ్రెస్ పార్టీలో తాజాగా మంటలు రేపుతున్నది. వాస్తవానికి భువనగిరి పార్లమెంటు పరిధిలోకి వచ్చే ఈ స్థానం నుంచి తనకు అనుకూలమైన నేతను బరిలోకి దించేందుకు చాలాకాలంగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న మర్రి నిరంజన్‌రెడ్డికి టికెట్ ఇప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ ఎంపీపీ అయిన నిరంజన్‌రెడ్డి గతంలో స్థానిక సంస్థలకు సంబంధించి వివిధ హోదాల్లో పని చేశారు. స్థానికంగానూ మంచి పట్టుందనేది ఆయన వర్గం వారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటిదాకా మల్‌రెడ్డి రంగారెడ్డికి అవకాశం ఇస్తూ వస్తున్నందున పార్టీ అధిష్ఠానం ఈసారి నిరంజన్‌రెడ్డికి ఇవ్వాలనేది కోమటిరెడ్డి వర్గీయుల వాదన. ఇందుకు సంబంధించి కొన్ని ఉదాహరణలు కూడా వారు అధిష్ఠానం ముందు ఉంచుతున్నట్లు తెలిసింది.

## అలిగి వెళ్లిపోయిన కోమటిరెడ్డి

ఇదే అంశంపై ఇటీవల ఢిల్లీలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. మల్‌రెడ్డి కోసం రేవంత్ పట్టుబట్టగా.. నిరంజన్‌రెడ్డికి ఇవ్వాల్సిందే, నా పార్లమెంటు పరిధిలోనైనా కనీసం నాకు ప్రాధాన్యత ఇవ్వకపోతే ఎలాగంటూ కోమటిరెడ్డి భీష్మించుకు కూర్చున్నారు. ఈ క్రమంలో జరిగిన వాగ్వాదంలో కోమటిరెడ్డి అలిగి, అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. అనంతరం ఇబ్రహీంపట్నంలోని నిరంజన్‌రెడ్డికి ఫోన్ చేసి.. నీ పని నువ్వు చేసుకో! టికెట్ నీకే వస్తుందంటూ భరోసా కల్పించినట్లు తెలిసింది. దీంతో ప్రస్తుతం ఒకవైపు మల్‌రెడ్డి తనకే టికెట్ అంటూ ప్రచారం చేసుకుంటుండగా, మరోవైపు నిరంజన్‌రెడ్డి సైతం తనకే టికెట్ వస్తుందంటూ క్షేత్రస్థాయిలో తిరుగుతున్నారు.

## తెరపైకి మరో ఇద్దరు బీసీ నేతలు

నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ ఆశావహుల్లో మరో ఇద్దరు బీసీ నేతలు కూడా ఉన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రతి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో రెండు అసెంబ్లీ టికెట్లు బీసీలకు ఇస్తానని మాట ఇచ్చినందున, అందులో భాగంగా ఇబ్రహీంపట్నం టికెట్ తమకే ఇవ్వాలంటూ ఆ బీసీ నేతలు పట్టుబడుతున్నారు. ఇవన్నీ పరిణామాలతో నియోజకవర్గం కాంగ్రెస్ నేతలు, శ్రేణులు అయోమయంలో పడిపోయాయి. కాంగ్రెస్ తీరు మారేదా? పోయేదా? అంటూ శ్రేణులు రాజకీయంగా సర్దుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గత కొన్నిరోజులుగా కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు గణనీయంగా పెరిగాయి. నిత్యం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో అనేక గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు గులాబీ కండువా కప్పుకుంటున్నారు.

## గెలుపెరుగని మల్‌రెడ్డి..!

2009 ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మల్‌రెడ్డి రంగారెడ్డికి పార్టీ అవకాశం ఇచ్చింది. ఆ ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు.

2014 ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి మల్‌రెడ్డికి అవకాశం ఇచ్చారు. అక్కడ కూడా ఆయన ఓటమి పాలయ్యారు.

2018 ఎన్నికల్లో పొత్తులో భాగంగా ఇబ్రహీంపట్నం స్థానం టీడీపీకి పోయింది. అయినప్పటికీ మల్‌రెడ్డి రంగారెడ్డి పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించి.. బీఎస్పీ నుంచి బరిలో నిలిచారు. అయినా ఆ ఎన్నికలోనూ ఓడిపోయారు.


ఇలా అనేకసార్లు పార్టీ అవకాశం ఇచ్చినా, ఇవ్వకున్నా మల్‌రెడ్డి పోటీలో నిలిచారని, కానీ ఇన్నాళ్లూ పార్టీని నమ్ముకొని.. సేవలందిస్తున్న వారికి అవకాశం ఇవ్వడంలేదనేది కోమటిరెడ్డితో పాటు ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు.

# కాంగ్రెస్ టికెట్ @ ₹25 కోట్లు..?

వ్యవహారం నడుపుతున్న రాష్ట్రానికి చెందిన ముఖ్యనేత

- ఢిల్లీలో ఏఐసీసీ కోర్టులో రాజేంద్రనగర్ లొల్లి
- టికెట్ కోసం 11 మంది దరఖాస్తు.. ముగ్గురి మధ్య హోరాహోరి
- రూ.25కోట్లు చెల్లించిన వారికే కాంగ్రెస్ టికెట్

- ఒక్కరికి టికెట్ ఇస్తే.. మిగతావారి దారెటు..?
- గ్రామగ్రామాన ఒకే పార్టీలో గ్రూపు రాజకీయాలు
- డోలాయమానంలో కాంగ్రెస్ క్యాడర్
- ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్ అభ్యర్థి



ముడుపులిచ్చిన వారికే..?

మణికొండ, అక్టోబర్ 10 : దేశ రాజధాని ఢిల్లీలో రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపికపై ఏఐసీసీ స్థాయిలో తర్జనభర్జనలు తీవ్రస్థాయిలో కొనసాగుతున్నట్లు తెలుస్తున్నది. టికెట్ కోసం ఎవరు అధికంగా పార్టీ రాష్ట్ర స్థాయి ముఖ్యనేతలకు ముడుపులు సమర్పించుకుంటే వారికే టికెట్ వరించే అవకాశం ఉందని ఆ పార్టీ నాయకుల్లో గుసగుసలు మొదలయ్యాయి. ఇప్పటికే అధికార పార్టీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేనే మరోసారి బరిలోకి దించిన విషయం తెలిసిందే. కాగా కాంగ్రెస్ నుంచి బలమైన అభ్యర్థి ఎవరన్నది ఇప్పటికీ స్పష్టతలేకపోవడంతో ఆ పార్టీ క్యాడర్ నిస్తేజంగా దిక్కులు చూస్తున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి 11మంది ఆశావాహులు ఎమ్మెల్యే టికెట్ కోసం అధిష్టానానికి దరఖాస్తులు చేసుకోగా.. వారిలో నుంచి పీసీసీ స్థాయి కమిటీ వడపోత చేపట్టి ముగ్గురి పేర్లను ఏఐసీసీకి పంపినట్లు సమాచారం. వారిలో టికెట్ ఎవరికి వస్తుందో తెలియక.. ఆశావాహులు కనీసం ఎన్నికల ప్రచారం నిర్వహించుకునేందుకు, కార్యకర్తలను కలిసేందుకు ఆసక్తి కనబర్చడం లేదు. దీంతో కార్యకర్తలు డోలాయమానంలో ఉన్నారు.

రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్‌ను ఆశిస్తున్న ముగ్గురిలో ఎవరు అధికంగా అధిష్టానానికి ముడుపులు చెల్లిస్తారో వారికే టికెట్ కట్టబెట్టే అవకాశాలున్నట్లు తెలిసింది. నియోజకవర్గానికి ఉన్న స్థాయిని బట్టి ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్ కేటాయించేందుకు ఏకంగా రూ.25కోట్లు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఓ రాష్ట్ర స్థాయి ప్రముఖనేత ఈ వ్యవహారాన్ని నడుపుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలే అనుకుంటున్నాయి. పార్టీ పరంగా చేయించుకున్న సర్వేలలో ఉత్తమ అభ్యర్థిగా తేలినా.. డబ్బులిచ్చేవారికే టికెట్ కేటాయించాలనే ప్రయత్నం చేస్తున్న నేతలపై సొంత పార్టీలో కార్యకర్తలు గుర్రుగా ఉన్నారు. అయితే ఒకవేళ డబ్బులిచ్చి టికెట్ పొందితే వారికి ఏ స్థాయిలో క్యాడర్ పనిచేస్తుందో.. లేదో..? అర్థం కాని పరిస్థితి. అంతేకాక ముగ్గురిలో ఒక్కరికి టికెట్ కేటాయించినా.. మిగతా వారు కలిసి పనిచేస్తారా? అన్నది సందేహంగానే మిగిలింది. నియోజకవర్గం వ్యాప్తంగా ఒక్కో గ్రామంలో మూడు నుంచి నాలుగు గ్రూపులుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పనిచేస్తుండటం, వీరంతా కలిసి పనిచేస్తారన్న నమ్మకం లేకపోవడంతో కోట్లాది రూపాయలు ముడుపులు చెల్లించి టికెట్ పొంది గెలుస్తామా అనే సందేహంలో అభ్యర్థులు ఉన్నట్లు సమాచారం.

## ఆ ముగ్గురిలో ముడిపడేదెవరికో..

కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ టికెట్ కోసం బొర్ర జ్ఞానేశ్వర్, కస్తూరి నరేందర్, గౌరీ సతీష్ పేర్లు ఏఐసీసీకి చేరాయి. ఈ ముగ్గురిలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సిట్టింగ్ మున్సిపల్ చైర్మన్, ప్రముఖ విద్యావేత్త టికెట్ కోసం తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో ఒకరు రెండు పర్యాయాలు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశానని, మరోసారి తనకు అవకాశం కల్పిస్తే ఖచ్చితంగా గెలిచి తీరుతానంటూ పట్టుబట్టారు. తాను సిట్టింగ్ మున్సిపల్ చైర్మన్ కావడంతో ఆర్థికంగా, అన్నివిధాలుగా బాగున్నానని, క్యాడర్ అంతా తన వెంటే ఉందని అధిష్టానాన్ని ఒప్పించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలిసింది. కాగా ప్రముఖ విద్యాసంస్థల అధినేత గౌరీ సతీష్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సభ్యుడిగా కొనసాగుతుండగా నియోజకవర్గంలో విద్యావంతులే అధికంగా ఉండటంతో తనకే టికెట్ కేటాయిస్తే ప్రత్యర్థికి గట్టి పోటీని ఇచ్చి విజయం సాధిస్తానంటూ అధిష్టానానికి విన్నవిస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ ముగ్గురిలో ఎవరికి టికెట్ వరిస్తుందో తెలియక పార్టీ నాయకులు, క్యాడర్ తలలు పట్టుకుంటున్నారు. ఒకవేళ చివరి నిమిషంలో వీరిలో ఎవరికో ఒక్కరికి ఖచ్చితంగా టికెట్ కేటాయించినా.. మరో ఇద్దరు వారితో సమన్వయంతో కలిసి పనిచేస్తారా..? అనే సందేహాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే అధికార పార్టీ అభ్యర్థి ప్రచారాన్ని ముమ్మరం చేసి దూసుకుపోతుండటంతో.. కాంగ్రెస్ పార్టీ క్యాడర్ అయోమయంలో పడ్డారు.



కందుకూరులో యువజన విభాగం సమ్మేళనంలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

## రాష్ట్రంలో ప్రతి పక్షాలకు చోటులేదు

- కందుకూరు వరకు మెట్రో రైల్ తెచ్చాం, మెడికల్ కాలేజీ తీసుకువచ్చాం
- వేల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశాం
- మరింత అభివృద్ధి జరుగాలంటే సబితా ఇంద్రారెడ్డిని గెలిపించాలి
- యువ సమ్మేళనంలో బీఆర్ఎప్ పార్టీ యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి

కందుకూరు, అక్టోబర్ 10 : సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చూపాలని ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు కార్తీక్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంఆర్ఆర్ రెస్టారెంట్‌లో జరిగిన మహేశ్వరం, కందుకూరు మండలాల బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం కార్యకర్తల యువ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్తీక్ రెడ్డి హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో ప్రతి పక్షాలకు చోటు లేదని చెప్పారు. బీజేపీకి రాష్ట్రంలో రెండు సీట్ల కంటే ఎక్కువ రావని, ఆ పార్టీకి ఓట్లు వేస్తే మురుగు కాల్వలో వేసినట్లేనని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి 50 ఏండ్లు అధికారం ఇస్తే ఏం చేసిందని ప్రశ్నించారు. కందుకూరు వరకు మెట్రో రైల్ వస్తున్నదని, మెడికల్ కాలేజీ తీసుకురావడంతో పాటు నియోజకవర్గం అభివృద్ధికి మంత్రి సబితాఇంద్రారెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. మరింత అభివృద్ధి జరుగాలంటే సబితా ఇంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు. రెండు నెలలు కష్టపడితే 5సంవత్సరాల పాటు మీ కోసం పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, సీనియర్ నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహా రెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు ముద్ద పవణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్ల కార్తీక్, మండల యువజన విభాగం అధ్యక్షుడు కొలను విఘ్నేశ్వర్‌రెడ్డి, మర్యాద రాఘువేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్‌రెడ్డి, శ్రీధర్ ముదిరాజ్, అజ్జు, దావుద్, ఎగ్గిడి గణేశ్, గొర్రెంకల రామకృష్ణ, ప్రశాంత్‌చారి, రామాంజనేయులు, వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ యువకులు పాల్గొన్నారు.

## నేడు పలు ప్రాంతాలలో.. నీటి సరఫరా బంద్

సిటీబ్యూరో, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే కృష్ణా డ్రింకింగ్ వాటర్ సరఫరా పథకం ఫేజ్-2లో గున్‌గల్ నుంచి సాహెబ్‌నగర్ వరకు ఉన్న 2200 ఎంఎం డయా ఎంఎస్ గ్రావిటీ మెయిన్ పైపులైన్‌కు రాగన్న గూడ వద్ద భారీ లీకేజీ ఏర్పడింది. ఈ లీకేజీని అరికట్టడానికి మరమ్మతు పనులు చేపడుతున్నారు. బుధవారం (నేడు) ఉదయం 6 నుంచి మరుసటి రోజు గురువారం ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు పలు డివిజన్ల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. మిరాలం, ఎన్‌పీఏ, బాలాపూర్, మైసారం, బార్కాస్, మేకలమండి, భోలక్‌పూర్, తార్నాక, లాలాపేట్, బౌద్ధనగర్, మారేడ్‌పల్లి, కంట్రోల్‌రూం, రైల్వేస్, ఎంఈఎస్, కంటోన్మెంట్, ప్రకాశ్‌నగర్, పాటిగడ్డ, హస్మత్‌పేట్, ఫిరోజ్‌గూడ, గౌతంనగర్, వైశాలినగర్, బీఎన్‌రెడ్డి నగర్, వనస్థలిపురం, ఆటోనగర్, అల్కాపురి కాలనీ, మహేంద్రహిల్స్, ఏలుగుట్ల, రామంతాపూర్, ఉప్పల్, నాచారం, హబ్సీగూడ, చిలుకానగర్, బీరప్పగడ్డ, బుద్వేల్, శాస్త్రిపురం, బోడుప్పల్, మీర్‌పేట్, బడంగ్‌పేట్, శంషాబాద్, మన్నెగూడ ప్రాంతాలలో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.



కసిరెడ్డి నారాయణరెడ్డికి టికెట్ ఇస్తే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పని చేస్తామంటూ సమావేశమైన తలకొండపల్లి మండల కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు

# కల్వకుర్తిలో కసిరెడ్డి కయ్యం..!

కల్వకుర్తి కాంగ్రెస్ నేతలు అధిష్ఠానానికి చుక్కలు చూపిస్తున్నారు. రాత్రికి రాత్రి పార్టీ కండువా కప్పుకున్న వారికి టికెట్ ఇస్తే ఊరుకునేది లేదంటూ రోజుకొక మండల పార్టీ కాంగ్రెస్ నేతలు అధిష్ఠానానికి హెచ్చరికలు చేస్తున్నారు. గత కొన్నిరోజులుగా పలు మండలాల్లో కీలక నేతలు, కార్యకర్తలు సమావేశాలు నిర్వహించి అల్టిమేటం జారీ చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం తలకొండపల్లి లోనూ సుంకిరెడ్డి ఆధ్వర్యంలో భారీ సమావేశం నిర్వహించి.. కసిరెడ్డికి టికెట్ ప్రకటన చేయగానే తాము పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తామని కుండబద్దలు కొట్టిచెప్పారు. ఈ నేపథ్యంలో మంగళవారం వంశీచంద్‌రెడ్డి కూడా కడ్తాల్‌లో సమావేశం నిర్వహించారు. కసిరెడ్డి నారాయణరెడ్డి కూడా ఈ సమావేశంలో ఉన్నా.. టికెట్ ఖరారుపై ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోవడం గమనార్హం.

- సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ)/ఆమనగల్లు

- తారాస్థాయికి చేరుకున్న వర్గపోరు
- అధిష్ఠానానికి చుక్కలు చూపుతున్న కాంగ్రెస్ నేతలు
- కల్వకుర్తిలో వేర్వేరుగా సమావేశమైన సుంకిరెడ్డి-వంశీచంద్ వర్గాలు
- కసిరెడ్డికి టికెట్ ఇస్తే పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తామని హెచ్చరిక

కల్వకుర్తి కాంగ్రెస్‌లో వర్గపోరు తారాస్థాయికి చేరుకున్నది. ప్యారాచూట్ నేత రాకతో పార్టీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. రాత్రికి రాత్రి కండువా కప్పుకున్న వారి కోసం ఇంతకాలం కష్టపడ్డ వారిని బలి చేస్తారా? అంటూ కీలక నేతలు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి గత ఏడాది, ఏడాదిన్నరగా సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉండి, పార్టీకి సేవలు అందించారు. ఈ నేపథ్యంలో టికెట్ కూడా ఆయనకే వస్తుందని, నియోజకవర్గంలోని నేతలు, కార్యకర్తలందరూ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో ఒక్కసారిగా కసిరెడ్డి నారాయణరెడ్డి ప్యారాచూట్ వేసుకొని కాంగ్రెస్‌లోకి దిగిపోవడంతో కుంపటి రాజుకున్నది. ఈ పరిణామంతో గత కొన్నిరోజులుగా నియోజకవర్గం పార్టీ నేతలు, కార్యకర్తలు వ్యతిరేక గళం వినిపిస్తూనే ఉన్నారు. ఆమనగల్లు, కల్వకుర్తి, మాడ్గుల, కడ్తాల్ మండలాల పరిధిల్లోని నేతలు, కార్యకర్తలు నిత్యం సమావేశాలు ఏర్పాటు చేసుకొని, కసిరెడ్డి రాకను వ్యతిరేకిస్తున్నారు.

## టికెట్ విషయం లేవనెత్తకుండా..

మంగళవారం వంశీచంద్‌రెడ్డి ఆమనగల్లు సమీపంలో డీఎంకే ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. కసిరెడ్డి నారాయణరెడ్డిని పరిచయం చేసేందుకు ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి తాము హాజరు కావడం లేదని సోమవారం సుంకిరెడ్డి ప్రకటించడంతో కీలక నేతలెవరూ అక్కడికి వెళ్లలేదు. ముఖ్యంగా గత కొన్నిరోజులుగా సుంకిరెడ్డికి అనుకూలంగా సమావేశాలు నిర్వహించిన మండల పార్టీ నేతలు, కార్యకర్తలెవరూ వంశీచంద్‌రెడ్డి ఏర్పాటు చేసిన సమావేశంలో కనిపించకపోవడం గమనార్హం. దీంతో వచ్చిన వారికి మాత్రమే కసిరెడ్డిని పరిచయం చేసిన వంశీచంద్‌రెడ్డి టికెట్ ఎవరికి వస్తుందనే అంశంపై మాత్రం పెదవి విప్పలేదు. ఒకవేళ ఆయన ఈ అంశాన్ని లేవనెత్తితే సమావేశానికి హాజరైన వారిలోనూ కొంతమంది వ్యతిరేకించే అవకాశం లేకపోలేదని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఒకవైపు కీలక నేతలు, కార్యకర్తలు సమావేశానికి రాకపోవడం, వచ్చిన వారిలోనూ కసిరెడ్డికి టికెట్ అని లేవనెత్తితే నిరసన గళం వినిపించే అవకాశమున్నందున ముందు జాగ్రత్తగా ఆ అంశాన్ని లేవనెత్తలేదని తెలుస్తున్నది.

## కసిరెడ్డికి ఇస్తే వ్యతిరేకంగా పని చేస్తాం

వంశీచంద్‌రెడ్డి ఏర్పాటు చేసిన సమావేశానికి అన్ని మండలాల నుంచి కొందరు నేతలు రాగా.. ఇదే సమయంలో తలకొండపల్లిలో మండల పార్టీ నేతలు, కార్యకర్తలు, ఎంపీటీసీలు, సర్పంచులు, అనుబంధ సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు స్పష్టమైన ప్రకటన చేశాయి. ప్యారాచూట్ నేతకు టికెట్ ఇచ్చేందుకు కొందరు నేతలు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఇంతకాలం పార్టీకి పనిచేసిన వారికి ఎలా న్యాయం జరుగుతుంది? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధిష్ఠానం మేల్కొని.. పార్టీ కోసం కష్టపడిన వారికి టికెట్ ఇవ్వాలని స్పష్టం చేశారు. అయినప్పటికీ తమ మనోభావాలను దెబ్బతీసేలా కసిరెడ్డి నారాయణరెడ్డికి టికెట్ ఇస్తే మాత్రం కచ్చితంగా పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తామని ప్రకటించారు. దీంతో నియోజకవర్గ కాంగ్రెస్‌లో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా తయారైందని పార్టీ నేతలే చెబుతున్నారు.